# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

June / జూన్-2025



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 101 June / జూన్-2025 No./ సంచిక : 6



| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన- చైతన్యప్రభు విరచితం | 2 |
| 2. | ధ్యానము - ఓంకారము (ముండకోపనిషత్) | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 5 |
| 4. | ఆనంద రామాయణం - పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 10 |
| 5. | నకులమాత | 14 |
| 6. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 18 |
| 7. | గురువాచకకోవై - వివరణ సాయికృష్ణ | 20 |
| 8. | ఏకజీవ వాదము - స్వామి బోధాత్మానంద | 22 |
| 9. | కార్యక్రమములు - విరాళములు | 25-28 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

**ఎ చైతన్యప్రభు విరచితం**

**శ్లో॥ కదాచిత్ కాళిందీతటవిపిన సంగీతతరళః**
**ముదా ౭ ౭ భీరీనారీవదనకమలాస్వాద మధుపః ।**
**రమా శంభు బ్రహ్మా మరపతి గణేశార్చితపదః**
**జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే ॥**

**తా॥** శ్రీకృష్ణుడే జగన్నాథుడని బహు ప్రమాణములున్నవి. అందువలననే శ్రీబలభద్ర సుభద్రలు కూడా దేవాలయమునందున్నారు. కనుక ఈ శ్లోకములో శ్రీకృష్ణుని రూపమాధుర్యము వివరించబడినది. ఈ దేవుడు కాళిందీ (యమునా) తీరమున ఉన్న ఉద్యానవనములో సంగీతమును (మురళిద్వారా) పాడుటకు కుతూహలము కలవాడు. ఇక తనకే సర్వము సమర్పించి సేవించుచున్న, సంతుష్టులైన గొల్లపడుచుల ముఖములు కమలములవలె నుండగా, వానియందలి సౌందర్యము అను తేనెను త్రాగునట్టి తుమ్మెదయే ఈ దేవుడు. ఈతని పాదములను లక్ష్మీదేవి, శివుడు, బ్రహ్మ, దేవేంద్రుడు, గణేశుడు మొదలగువారు సేవించుచుందురు. అట్టి జగన్నాథస్వామి నాకు నయనపథగామి (ప్రత్యక్షము) అగునుగాక!

# ధ్యానము

## ఆత్మను తెలుసుకో : 1-2

**కా॥ ఆవిః సన్నిహితం గుహాచరం నామ మహత్పదమత్రైతత్ సమర్పితమ్।**
**ఏజత్ ప్రాణాన్నిమిషచ్చ యదేతత్ జానథ సదసద్వరేణ్యం**
**పరం విజ్ఞానాద్ యద్వరిష్ఠం ప్రజానామ్ ॥**

ఆవిః= ప్రకాశవంతమైన; సన్నిహితం = అతి సమీపంలో; గుహచరం నామ= హృద్గుహలో సంచరించేదైన; మహత్ పదం= ఉత్కృష్టమైన లక్ష్యం; అత్ర=దాన్లో; ఏతత్= ఇది; సమర్పితమ్= నెలకొని ఉన్నది; ఏజత్ = సంచరించే; ప్రాగాసత్= స్థూలమైన; అసత్ = సూక్ష్మమైన; వరేణ్యం= ఉత్కృష్టమైన; ప్రజానామ్=జీవుల; విజ్ఞానాద్= తెలివికంటే; పరం= అతీతమైనది, వరిష్ఠం = సర్వశ్రేష్ఠం.

**1.** ఆ ఆత్మ ప్రకాశమానమైనది, అత్యంత సమీపంలో ఉన్నది! హృద్గుహలో నెలకొన్నది. జీవితంలో ఉత్కృష్ట లక్ష్యం ఆ ఆత్మే. కదిలేవి, శ్వాసించేవి, రెప్పలల్లార్చేవి

అన్ని జీవరాశులు ఆ ఆత్మలోనే ప్రతిష్ఠితమై ఉన్నాయి. స్థూలమైనది, సూక్ష్మమైనది అదే. పరమోత్కృష్ట జ్ఞానానికి అతీతమైనది అది. (అనుభవం ద్వారా తెలుసుకోతగ్గది కాబట్టి) ఉత్కృష్టమైన ఆ ఆత్మనే తెలుసుకోవాలి.

ఆత్మ జ్ఞానానికి అతీతమైనది, కాని ఆత్మనే తెలుసుకోవాలి. ఈ రెండు పరస్పర విరుద్ధంగా తోస్తున్నవి. తెలుసుకోవాలి, కాని తెలుసుకోలేం. దీనికి అర్థం ఏమిటి? తెలుసుకోలేం అంటే లోకంలోని వస్తువులను తెలుసుకొన్నట్లు తెలుసుకోలేం, ఇంద్రియాలతో తెలుసుకోలేమని అర్థం. ఇంద్రియాలు కేవలం పరికరాలు. వాటి హద్దులు పరిమితమైనవి. ఉన్నది ఉన్నట్లు చూపగలవి మాత్రమే మన ఇంద్రియాలు. దీనిని భౌతిక పరిమాణం, దివ్య పరిమాణం అంటూ రెండు పరిమాణాల్లోనూ అర్థం చేసుకొందాం.

**1. భౌతిక పరిమాణం:** ఒక ఫలానా దూరం తరువాత మన కళ్ళతో చూడలేం. ఒక ఫలానా హద్దుకుపైగా మన చెవులు వినలేవు. ఇదే తీరు ప్రతి ఒక్క ఇంద్రియానికీ వర్తిస్తుంది. అంతేకాదు. పౌనఃపున్య హద్దులకు (frequency limits) వెలుపల ఉన్న వెలుతురునో శబ్దాన్నో అవి మన సమీపంలో ఉన్నప్పటికీ చూడడమో, వినడమో చేయలేం కనుక ఇంద్రియాలు పనిచేసే పరిధి చాలా చిన్నది.

**2. దివ్య పరిమాణం:** చూసేవారిని, వినేవారిని, అనుభూతి చెందేవారిని కూడా, ఇంద్రియాలు ఉన్నది ఉన్నట్లు తెలుసుకోలేవు. "ఒక సామాన్యమైన పువ్వును తీసుకోండి. ఇది ఒక హద్దుకు పరిమితమైనదే. కాని పువ్వు గురించి అంతా నాకు తెలుసని సాహసించి ఎవరైనా చెప్పగలరా? ఆ పువ్వు గురించిన సమస్తం తెలుసన్న చివరి స్థితి పొందడం సాధ్యమే కాదు. విచారణ ప్రారంభంలో హద్దులున్నట్లు తోచిన పువ్వు ఇప్పుడు హద్దులు లేనిదయింది.... మన హద్దులు అమిత పరిమితమైనవి" అంటున్నారు స్వామి వివేకానంద అంటే హద్దులు లేని వాటిని హద్దులున్న వాటిగా మనం కనుగొన్నాం. ఏ వస్తువునూ దాని నిజస్థితిలో మనం చూడలేము. కనుక నిజాన్ని తెలుసుకోవాలంటే ఈ ఇంద్రియాలూ మనస్సూ చాలవు. వాటి కంటే ఉత్కృష్టమైనవి కావాలి.

ఆ ఉత్కృష్టమైనది 'దివ్య నేత్ర' మని గీత (11.8) వచిస్తోంది. దివ్యనేత్రం అంటే మూడవ కన్ను అని అర్థం కాదు. ఇక్కడ సూచిస్తున్నది మన చైతన్య స్థితిలో ఒక మార్పు, బుద్ధిలో వికాసాన్ని. కళ్ళో చెవులో లేకుండా చూడడమో వినడమో



సాధ్యమా? సాధ్యమే. ఇందుకు కల ఒక ఉదాహరణ. కలలో మన ఇంద్రియాలు ఏవీ పనిచేయవు. అయినప్పటికీ అక్కడ మనం చూస్తున్నాం, వింటున్నాం, తెలుసుకొంటున్నాం. జాగ్రదావస్థలో ఇంద్రియాల మూలంగా జరిగేవి అన్నీ స్వప్నావస్థలో ఇంద్రియాలు లేకుండానే జరుగుతున్నాయి.

ఇదొక ఉదాహరణ మాత్రమే. ఈ విధంగా ఇంద్రియాల సహాయం లేకుండా మనస్సు సహాయం లేకుండా ఆత్మను తెలుసుకోవచ్చును. అలాంటి స్థితిని పొందాలి.

ఒక పురుషుడు శ్రీరామకృష్ణులతో "నన్ననుగ్రహించి నాకొక్క మాటలో జ్ఞానోదయం అయ్యేట్లు ఉపదేశించండి" అని అడిగాడు. అందుకాయన, " 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' (పర బ్రహ్మమే సత్యమైనది, జగత్తు మిథ్య) తత్త్వాన్ని గ్రహించు" అని పలికి మిన్నకున్నారు. **–రామకృష్ణుల ఉపదేశరత్నాలు**

పేరు ఏదైనా, సత్యం ఒక్కటి, అంటే రెండవది లేనిది. **–తత్త్వవిదానంద**

శ్రద్ధ వలన ఏకాగ్రత కలుగును. అనగా అనేక విషయములపై అత్యంత వేగముతో సంచరించు మనస్సును ఒకే విషయముపై నిలుపుటయే ఏకాగ్రత. శ్రద్ధ వలన అట్టి ఏకాగ్రత లభించినపుడు అది ధ్యానమునకు దారితీయును. ఒకే విషయముపై యెడతెగని ఏకాగ్రత కలిగి యుండుటయే ధ్యానము. ఆ ధ్యానము దృఢముగా దీర్ఘకాలము అభ్యసించిన అతి సూక్ష్మ స్థితికి పెరిగి సమాధికి మార్గమగును. సమాధి ఆత్మ జ్ఞానానుభవము నందించును.

సమాధి అనగా మనో వ్యాపారము పూర్తిగా ఆగిపోయి వాటికాధారమైన తాను వాటితో కలియకుండ తాను తనయందే నిలిచి యుండు స్థితి. తన నిజ స్వరూపానుభవము కలిగినపుడు తాను మనస్సు, శరీరములు కాననియు, తన నిజ స్వరూపము సచ్చిదానందమనియు అనుభవమగును. అట్టి అనుభవమును సంపాదించుటయే మానవ జీవిత పరమార్థము. అదియే మోక్షము. **–సద్గురు సుభాషితం**

లోకంలో అందరూ సుఖంగా ఉండాలి. అందరికీ శుభములే జరగాలి. ఎవ్వరికినీ రోగములు, దుఃఖములూ రాకూడదు. అని నిత్యము ప్రార్థన చేయుము.

**–సూక్తి ముక్తావళి**

అర్హత! అర్హత కలిగియుండవలెను. దేనిని అడుగవలసినదిలేదు. అర్హత యున్నయెడల సమస్తము అయాచితముగనే పాదముల చెంతకు ఏతెంచి తీరును.

**– ఓంకార సూక్తులు**

అవసరానికి మించి ఒక్కమాట కూడా అదనంగా మాట్లాడకండి.

**–చిన్మయ మిషన్**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 60**

## సోదరి సుశీలాదేవి జ్ఞాపకార్థం – డిసెంబర్ 1957 – నివాళులు

వేలమంది ఆశ్రమ భక్తులు భారతదేశ వ్యాప్తంగా మరియు విదేశాల్లోని వారు కూడా సోదరి సుశీలాదేవి ఆకస్మిక మరణవార్త విని నిర్ఘాంతపోయారు. ఆమె భౌతికంగా ఈ లోకంలో జీవించిలేకపోయినా ఆత్మ స్వరూపంగా ఇప్పుడు ఇంకా ఎక్కువగా అందరి హృదయాల్లో జీవించే ఉన్నారు.

ఆమె యవ్వనంలోనే శాంతి కార్యకలాపాలకి తన జీవితాన్ని అంకితం చేసి, భారతమాత బిడ్డలకి, బాధితులకు, రోగులకు సంవత్సరాలుగా ఎన్నో సేవ లందించారు. ఆమె నిరంతరము కష్టపడి, చిరునవ్వుతో నిస్వార్థంగా, ఉచితంగా సేవలు చేసేవారు. పేరు ప్రఖ్యాతులు గల సర్జన్లు డా॥ ఎం.సి. కిన్ని గారితో, డా॥ సి.కె.ప్రసాదరావు గారితో, డా॥ జానాదేవన్ గారితో అలాగే డా॥ రమణగారితో కలిసి పనిచేశారు. వాల్తేరులోని శాంతికేంద్రములోని వైద్యశాలలో వీరికి సహాయ కారిగా సేవలందించారు.

తన తల్లిగారి ఆరోగ్యం చూసుకోవడానికి అమెరికా వెళ్ళిన సోదరి సుశీలాదేవి త్వరలోనే తన సొంత ఇల్లు అని భావించే భారతదేశానికి తిరిగి రావాలనుకున్నారు. చాలా సంవత్సరాలు ప్రయత్నించారు. కానీ ఎప్పుడూ ఆమె ఇంటిలో ఎవరో ఒకరు జబ్బు పడటం వలన వారికి సేవలందిస్తూ ఉండిపోయారు. చివరికి ఈ సంవత్సరము భారతదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకొని అందుకు అవసరమయిన ఏర్పాట్లు అన్నీ పూర్తి చేసుకున్నారు. ఇండియన్ ఎంబసీ మరియు యు.ఎస్.ఎ. ప్రభుత్వం నుండి అనుమతి పొందారు.

న్యూయార్క్ నగరంలో ఒక సమావేశంలో పాల్గొని తన సోదరుడితో కలిసి తన ఇంటికి న్యూజెర్సీకి తిరిగి ప్రయాణమయ్యారు. ఆమె సోదరి చార్లెట్టు వద్ద నుండి అందిన సమాచారం చూచి మేమందరము నిర్ఘాంతపోయాము. అందులో ఇలా ఉంది. "సోదరుడు ఓంకార్ గారికి ప్రణామాలు, మీకు ఇలాంటి చెడు సమాచారం అందించవలసి వచ్చినందుకు నేను చాలా విచారిస్తున్నాను. నా ప్రియమయిన సోదరి, సోదరుడు నిన్న రాత్రి న్యూయార్క్ నుండి తిరిగి వస్తుండగా ఇంటికి సమీపంలోనే కారు విపరీతమయిన వేగంతో వచ్చి గుద్దటం వలన వెంటనే ప్రమాద స్థలంలోనే మరణించారు. ఒక వైద్యుడు వెంటనే వారి వద్దకు పరుగెత్తుకొని వెళ్ళాడు



కాని వారు అప్పటికే మరణించారు. నేను ఇంకా అందులో నుండి బయట పడలేదు. కూర్చుని ఏడుస్తూనే ఉన్నాను.

క్లెయిర్, మీ సోదరి సుశీలా చాలా సంతోషకరమయిన జన్మదినాన్ని జరుపుకుంది. మీ వద్ద నుండి ఉత్తరము, ఆశీస్సులు అందుకుని ఈ శీతాకాలంలో భారతదేశము రావటానికి సమాయత్తమయింది. నేను వారిద్దరిని చాలా కోల్పోయాను. నవంబరు 19వ తేదీన ఆమెను సమాధి చేస్తున్నాము. నా సోదరి భారతదేశంలో ఉన్నప్పుడు మీరు ఆమెపట్ల చూపించిన ప్రేమానురాగాలకు నా ధన్యవాదాలు.

ఈ సమాచారానికి బదులుగా బాధతో టెలిగ్రాము సందేశము పంపించాము. "భారతదేశము తన ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది. మీ ఉత్తరానికి ధన్యవాదాలు. ధైర్యంగా ఉండు. భగవంతుని సన్నిధిని అనుభూతి చెందు. ఉత్తరాలు వ్రాస్తుంటాను – ఓంకార్."

సుశీలాదేవి జన్మదినము నవంబరు 9వ తేదీన ఆమె ఇంట్లో యు.ఎస్.ఎ. అలాగే ఆశ్రమములో కూడా జరపబడుతోంది. ఆమె తన ఆఖరి ఉత్తరాన్ని నవంబరు 13వ తేదీ రాత్రి 8 గంటలకు పంపించింది. అందులో ఆమె తొందరలోనే భారత దేశానికి వస్తున్నట్లుగా వ్రాసింది. ఆ తర్వాత రాత్రి ఆమె ప్రమాదవశాత్తూ తన ప్రియమయిన సోదరుడు ఫ్రాంక్‌తో కూడా మరణించింది. ఆమెను నవంబరు 19వ తేదీన సమాధి చేశారు. అంతా పదిరోజుల కాలములో పూర్తి అయిపోయింది. ఈ భౌతికమయిన జీవితము నిజంగా ఎంత అనిత్యమయినది. కాని అంతర్ముఖ జీవితము, ఆధ్యాత్మికంగా శాశ్వతమయినది, అనంతమయినది. భగవంతుని లీలలు చిత్రంగా, అనూహ్యంగా ఉంటాయి. మన సంకల్పాలు కాకుండా భగవంతుని సంకల్పము ఎప్పుడు పనిచేస్తుంటుంది.

ఆశ్రమ వాసులందరికీ ఈ బాధకరమయిన ప్రమాదవార్త ఎంతో భయంకరంగా, ఆశనిపాతంలా ఉంది. హృదయవిదారకమయిన, తిరిగి మళ్ళీ పూడ్చుకోలేనటువంటి ఈ లోటు ఆశ్రమానికి, భారతమాతకు ఎంతో భారమయినది. ఆమె భారతదేశంలో నివసించినంత కాలం తన పూర్తి జీవితాన్ని అంకితం చేసింది. రామేశ్వరం నుండి హిమాలయాల దాకా భారతదేశమంతా ఆమె పర్యటనలు చేసి, అన్ని ముఖ్యమయిన ప్రదేశాలను సందర్శించి, భగవంతుని బిడ్డలందరి హృదయాల్లో శాంతి బీజాలను జాతి, మత, కుల భేదము లేకుండా నాటింది.

ఆధ్యాత్మిక ప్రపంచంలో, స్వామి నారాయణన్ శ్రీ రామతీర్థ గారి ముఖ్యశిష్యులు. న్యూయార్క్ నగరానికి చెందిన రామకృష్ణ మఠం స్వామీజీ బోధానంద గారు,

అలాగే స్వామి యోగానంద్ గారు, దివ్యజీవన సంఘం వ్యవస్థాపకులయిన స్వామి రాజేశ్వరానంద గారు, ఇంకా అనేకమంది ఇతర స్వామీజీలు అందరికీ సుశీలాదేవి పట్ల ఎంతో గౌరవము, ఆదరాభిమానాలు ఉండేవి. ఆమె అంకితమయిన జీవితము పట్ల నిస్వార్థమయిన సేవల పట్ల వారికి ఎంతో పూజ్యభావముండేది. అదే స్ఫూర్తితో ఆమె తిరిగి భారతదేశము వచ్చి గొప్ప కార్యాలు చేయాలనుకుంది. హా! ఇంక మనము ప్రేమమూర్తి అయిన సుశీలాదేవిని చూడలేము. ఆమె భారతదేశానికి కాకుండా అమెరికా దేశానికి కూడా గొప్ప వరం లాంటిది.

కన్నీరు రావటం లేదు. దానివలన ఆమెకిగాని, మనకి గాని ఎలాంటి ప్రయోజనము లేదు. ఆమె ఖాళీ చేసిన స్థలం వైపు నేను ఎంతో గొప్పస్ఫూర్తితో చూస్తుంటాను. నేనిప్పుడు ఇంకా దగ్గరగా ఉన్నట్లుగా భావిస్తుంటాను. ఆమె ప్రేమమయ ఆత్మను అనుభూతి చెందుతుంటాను. విచారించడానికి బదులుగా ఆమె ప్రేమ, దయ, సేవ, కరుణ ఇంతకుముందు కంటే ఎక్కువగా నాలో ప్రవేశించి నాకు స్ఫూర్తిని అందిస్తున్నట్లుగా అనిపిస్తోంది. మన భౌతిక దేహము జీవించిన చోట కంటే మన మనస్సు జీవించిన చోట మనము నిజంగా బ్రతికి ఉన్నట్లు అని పెద్దలు చెపుతారు. ఆమె దేహము యు.ఎస్.ఎ.లో ఉన్నప్పటికీ, ఆమె హృదయము, మనస్సు, ఆత్మ భారతదేశములోనే ఉంది. ఆమె చేసిన నిరుపమానమయిన సేవల ద్వారా, జంతువులకు, రోగులకు, పేదలకి, దేవుని బిడ్డలందరికి సేవలందించింది. అన్నింటికి అతీతమయిన స్థితికి చేరుకున్నవారు మరణించిన తర్వాత వారి ఆత్మ భగవంతునిలో లీనమవుతుంది అని చెపుతారు.

భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? ఈ భూమి మీద మన శరీరాల్లో ఆయన నివసించి ఉన్నాడు. అందువలన ఆమె ఆత్మ మనందరిలోనూ ప్రవేశించి మనతోనే ఉంది అనటం ఎంతో సహజమయిన విషయం.

సుశీలాదేవి విశ్వప్రేమ, నిస్వార్థ సేవలు నాకు శుక మహర్షిని గుర్తుకు తెస్తాయి. శుకదేవుడు ఇల్లు వదిలి అరణ్యాల్లోనికి తపస్సు, కఠోరమయిన నియమాలతో కూడిన సాధనలు చేయటానికి వెళ్ళాడు. అతని వృద్ధుడయిన తండ్రి పుత్రుడి పట్ల మమకారముతో అతని వెంట వెళుతూ ఆర్తితో పిలవసాగాడు. “శుకా, శుకా, శుకా” అని. అప్పుడు వ్యాసుడు ఆశ్చర్యపడేవిధంగా ప్రకృతిలోని కొండలు, సరస్సులు, చెట్లు, పొదలు అతని పిలుపుకి స్పందించాయి. ప్రకృతిలోని అణువణువు సమాధాన మిస్తోంది. శుకునికి బదులుగా, ఎందుకంటే శుకుడు ఒక దేహానికి పరిమితమయిన వాడు కాదు అని. అతను విశ్వప్రేమ కోసం జీవిస్తున్నాడని, అందరి గురించి



అనుభూతి చెందుతాడని, అందరిని సమానంగా ప్రేమిస్తాడని ఇది ఋజువు చేస్తోంది. మన సుశీల జీవితం కూడా నిజంగా అలాంటిదే. ఆమె దగ్గర ఏముందో, దానిని అందరితో పంచుకునేది. పేదవారితో, రోగులతో అందరితో పంచుకునేది. కుడిచేతితో చేసినపని ఎడమచేతికి తెలియనిచ్చేది కాదు. నిస్సహాయులందరికి సేవలందించేది. ఆమె ప్రేమతో జీవించడానికి ప్రయత్నించేది. అందరి గురించి బాధపడేది. ఆమె ప్రేమకు అందరూ పాత్రులయ్యారు. ఆమె ఎవ్వరినీ వదలిపెట్టలేదు.

నా హృదయం ఆమె జ్ఞాపకాలతో బరువెక్కిపోగా నేను చుట్టూ చూశాను. ఆమె ప్రేమ, ఆమె ఉనికి నాకు కొండకోనల్లో, చెట్లల్లో, పుట్టల్లో, పొదల్లో, పక్షుల కిలకిలా రావాల్లో వికసించిన పూల సుగంధాలలో, చిన్ని పిల్లిపిల్ల అరుపులో, పసిపాప చిరునవ్వులో అంతటా కనిపించసాగింది. మనకు అంతటా ఆమె ఉనికి, ప్రేమ అనుభవంలోనికి వస్తున్నాయంటే ఆమె వాటన్నింటిలోనూ, ఆయా రూపాల్లో దర్శన మిస్తోందంటే ఆమె అంతటా ప్రవేశించింది? అన్ని బంధాల నుండి విముక్తి పొందిన ఆత్మలు దేహాన్ని వీడి నామరూపాలను వదిలి గాలి బుడగలాగా అనంత మయిన సముద్రము లాంటి భగవంతునిలో చేరుకుంటారని మనకు పెద్దలు చెప్పారు కదా?

ఆమె జీవించి ఉన్నప్పుడు పలు పనులు చేసేది, ఊపిరి పీల్చేది, భగవంతుని బిడ్డలందరికి సేవలందించాలని కలలు కనేది. ఇప్పుడు మరణించినా, దేహము వదిలి మారిపోయినా ఆమె ఇంకా తాను వదిలిపెట్టి వెళ్ళిన మానవ సేవ గురించే కలలు కంటుంది.

ఏ విధంగా మనము ఆమె ప్రియమయిన జ్ఞాపకాలకు శాశ్వతత్వాన్ని ఇవ్వగలము? మన వద్ద నున్న సంచార వైద్యశాలను ప్రారంభించబోతున్నాము. అలాగే శాంతి వ్యాను ద్వారా ఆధ్యాత్మిక ప్రచారము చేయాలి. అది పల్లె పల్లెలకూ, ఒక పట్టణం నుండి వేరొక పట్టణానికి తిరిగి అందరి హృదయంలో శాంతిని నింపి ప్రతి వ్యక్తికి, వ్యక్తిగతంగా ఆధ్యాత్మికంగా ఎదగటానికి, వారి కుటుంబాలను స్వర్గసీమగా మార్చు కునేందుకు సహాయపడుతుంది. ఆ శాంతి వ్యానుకి “సుశీలా శాంతి వ్యాను” అని పేరు పెట్టాము. దానిని కొనటానికి సుశీలాదేవి ఇరవై ఐదు వేల రూపాయలు పంపించింది. శాంతి ఆశ్రమము వృద్ధి చెందాలని ఆమె కోరిక. ఇక తొందరలోనే పూర్తికావస్తున్న వైద్యశాలకు కూడా “సుశీలా వైద్యశాల” అని పేరు పెట్టాలని నిర్ణయించుకున్నాము. ఆమె అసలయిన అమెరికా పేరు సెయింట్ క్లేయిర్ నోవాల్డు అందువలన వైద్యశాలలోని ప్రసూతి విభాగానికి ‘సెయింట్ క్లేయిర్ మెటర్నటీ వార్డ్’ అని పేరు పెట్టాలనుకున్నాము. ఆమె ఇప్పుడు మాతో ఇంకా ఎక్కువగా ఉంది.

అందువల్ల ఆమె భక్తులయిన స్నేహితులందరూ ఆమె కలలను సాకారము చేయటం చూచి ఎంతో సంతోషిస్తుంది.

ఈ ప్రపంచంలోనికి మనము ఖాళీ చేతులతో నిరుపేదలుగా వచ్చాము. ఈ ప్రపంచము నుండి మనము ఖాళీ చేతులతో నిరుపేదలుగానే వెళ్ళిపోతాము. మనము ఇతరులకు చేసిన సహాయము మనలను వెంబడించి మనతో వస్తుంది.

నేను సుశీలాదేవి భక్తులయిన స్నేహితులను, శ్రేయోభిలాషులను ఆమె కోసం ప్రార్థించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. ఆమె ప్రియమయిన కలలు అన్నీ కార్యరూపం దాల్చాలని కోరుకుంటున్నాను. సుశీల వైద్యశాల, చాలా గొప్ప సహాయకారిగా ఇక్కడి అందమయిన కొండకోనల్లోని నిరుపేదలయిన రోగుల అవసరాలు తీరుస్తుంది. ఇక్కడ వైద్యం అనేది పూర్తిగా అందుబాటులో లేదు. అందువలన వైద్యశాలని సుశీలాదేవి పేరుతో అంకితం చేస్తున్నాము. ప్రియ సోదరి జీవించే ఉంది మాతో కలిసి. ఇంతకుముందు కంటే ఎక్కువగా పనిచేస్తోంది. వైభవమంతా ఆపరమాత్మదే. తూర్పు పడమర దేశాల్లోని దేవుని బిడ్డలందరికి శాంతి లభించుగాక! ఆమెన్

ఓం శాంతి.. ఓం శాంతి... ఓం శాంతి...

శ్లో॥ ఆశయా బధ్యతే లోకః కర్మణా బహుచింతయా
ఆయుక్షీణం నజానాతి తస్మాజ్జాగ్రత జాగ్రత॥

తా॥ మలములోని పురుగులవలె, బావిలోని కప్పవలె, అంధకారములో అజ్ఞానములో నిన్నగాక మొన్నవచ్చి, రేపో మాపో పోనున్న శరీరమునే శాశ్వతమని భ్రమపడి, నిత్యసుఖము నిచ్చు దానినిగా, నీసర్వస్వముగా చేసుకొని, జీవించుచుంటివా? నీ గాఢనిద్ర నుండి లెమ్ము! శరీర జ్ఞప్తికి స్వస్తి చెప్పుము; నీ స్వస్వరూపమును తెలిసికొనుటకు మేల్కొనుము! అఖండ కోటి దివ్యతేజ స్వరూపంబైన నీ దివ్యతేజస్సును వ్యక్త పరచుము. అప్పుడే నీవు చనిపోయిన వారికి, జీవించినవారికి గూడ నీ ఆదర్శనీయమైన జీవితముచే తోడ్పడగలవు. మృతామృతజీవులు నీసేవకై వేచియుండిరి. మేల్కొని స్వార్థత్యాగముతో సేవ జేయుట కిదియే సమయము. ఏలయన నేడే మనది. రేపు మనది గాదు గాన, నేడే ఈ క్షణమునందే నీలో నిద్రబోవుచున్న ఆత్మశక్తిని మేల్కొల్పి నీ స్వస్వరూపానందముతో మానవసేవను చేయుచు, లోకశాంతికి తోడ్పడెదవు గాక!

**– ఓంకార స్వామీజీ**



# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**స ఏవ విష్ణుస్త్వం రామ జాతోఽసిబ్రహోఽణార్థినః ।**
**మయి స్థితం తు త్వత్తేజః త్వయైవ పునరాహృతమ్ ॥ 371**

**అద్య మే సఫలం జన్మ ప్రతీతోఽసి మమ ప్రభో ।**
**నమోఽస్తు జగతాం నాథ నమస్తే భక్తిభావన ॥ 372**

**నమః కారుణికానంత రామచంద్ర నమోఽస్తు తే ।**
**దేవ యద్యత్కృతం పుణ్యం మయా లోకజిగీషయా ॥ 373**

**తత్సర్వం తన బాణాయ భూయాద్రామ నమోఽస్తుతే ।**
**తతో ముక్త్వా శరం రామస్తత్కర్మ భస్మసాత్కరోత్ ॥ 374**

**తతః ప్రసన్నో భగవాన్ శ్రీరామః కరుణామయః ।**
**జామదగ్న్యం తదా ప్రాహ వరం వరయ చేతి సః ॥ 375**

**తతః ప్రీతేన మనసా భార్గవో రామమబ్రవీత్ ।**
**యది మేనుఽగ్రహో రామ తవాస్తి మధుసూదన ॥ 376**

**త్వద్భక్తసంగస్త్వత్పాదే మమ భక్తిః సదాఽస్తు వై ।**
**తథేతి రాఘవేణోక్తః పరిక్రమ్య ప్రణమ్య తమ్ ॥ 377**

**పూజితస్తదనుజ్ఞాతో మహేంద్రాచలమన్వగాత్ ।**
**రావణేన జితా దేవాః సగర్వో రావణో మహాన్ ॥ 378**

**సహస్రబాహునా బద్ధః సోఽర్జునో భార్గవేణహి ।**
**హతః క్షణేన సమరే సోఽద్య శ్రీభార్గవోఽపి చ ॥ 379**

**జితస్తద్ధనుషా బాణమోచనాద్రాఘవేణ హి ।**
**ఏవం శ్రీరామచంద్రస్య పౌరుషం కిం వదామ్యహమ్ ॥ 380**

మునుపు నేను నీకిచ్చిన తేజస్సును మరల తీసికొనుచున్నాను. అపుడు తపము నాచరించుచు, బ్రహ్మకల్పపర్యంతము సుఖముగా నుండుము,” అని చెప్పి, అంతర్ధానము నొందినందున, అట్లే సర్వము నాచే ఆచరింపబడినది. ఆ విష్ణువే నీవు. బ్రహ్మదేవునిచే ప్రార్థింపబడి, యవతరించితివి. నాయందుండిన నీ తేజస్సును ఇపుడు తీసికొంటిని. ఇపుడు నా జన్మము సఫలమయినది. నాకు ప్రసన్నుడవైతివి.

లోకైకప్రభువై, భక్తపరాధీనుడై, కారుణికోత్తముడై, అనంతుడగు శ్రీరామచంద్రమూర్తీ! నీకు నమస్కారము, ఈ వరకు ఏమేమి పుణ్యము లోకయజ్ఞార్థముగా నా చేత చేయబడి యున్నదో అదంతయును నీబాణమునకు లక్ష్యమగుగాక. శ్రీరామా! నీకు నమస్కారము. మరల నమస్కారము. అని యిట్లు పరశురాముడు వేడుకొనుచుండగా, శ్రీరాముడు బాణమును ప్రయోగించి, ఆ సత్కర్మరాశిని భస్మము చేసెను. పిదప కరుణాకరుడైన శ్రీరాముడు ప్రసన్నుడై పరశురాముని వరము వేడుమనెను. అందుకు జామదగ్న్య పుత్రుడు, "శ్రీరామమూర్తీ! నీకు నాయందు అనుగ్రహబుద్ధి కలిగినట్లైతే, నీ భక్తుల సహవాసమును, నీయందు నిరంతర భక్తియును నాకు కలుగనీ," అని ప్రార్థించగా, అట్లే కానిమ్మని రామునిచే వరముపొంది, ప్రదక్షిణ నమస్కారములను చేసి, పూజలనంది, రాముని నుండి శెలవు తీసుకుని, మహేంద్రగిరికి వెడలెను. పార్వతీదేవీ! దేవతలను జయించి, గర్వించిన రావణాసురుని తన వేయిచేతులతో బిగించిన కార్తవీర్యార్జునుని క్షణమాత్రమున యుద్ధమందు చిత్తుచేసిన భార్గవరాముడు ఈ శ్రీరామునిచేతిలో ఓటమినందెను, అట్టి విజేతయైన శ్రీరామచంద్రుని పౌరుషమును ఏమని వర్ణింతును. (380)

**అథ రాజాదశరథో రామం మృతమివాగతమ్ ।**
**దృఢమాలింగ్య హర్షేణ నేత్రాభ్యాం జలముత్సృజన్ ॥ 381**
**తతః ప్రీతేన మనసా స్వస్థచిత్తః పురీం యయౌ ।**
**అయోధ్యాయాం సుమంత్రోఽపి నృప శ్రుత్వా సమాగతమ్ ॥ 382**
**నగరీం శోభయామాస పతాకధ్వజతోరణైః ।**
**వారణేంద్రం పురస్కృత్య రామం ప్రత్యుద్యయౌ జవాత్ ॥ 383**
**అథో నదత్సు వాద్యేషు రాజా పుత్రైస్సుహృజ్జనైః ।**
**నివేశ నగరం పౌరైః పశ్యన్నృత్యాదికం పథి॥ 384**
**రామాద్యాః స్వస్వపత్న్యా తే గజసంస్థా యయుః పురీమ్ ।**
**ననృతుర్వారనార్యశ్చ తుష్టువుర్మాగధాదయః॥ 385**
**ఏవం రాజా గృహం గత్వా బాలకైః స్వీయసద్మని ।**
**రమాపూజాః కారయిత్వా దదౌ దానాన్యనేకశః ॥ 386**
**తదాఽ లంకారవస్త్రాద్యైః సుహృదః పార్థివాదయః ।**
**రామాదీన్పూజయామాసు స్తదాదశరథం నృపమ్ ॥ 387**



**దశరథోఽపి తాస్సర్వాన్ పూజయామాస వైభవైః ।**
**తతస్తే సుహృదః సర్వే నృపాశ్చ స్వస్థలం యయుః ॥ 388**
**ప్రీత్యా యుధాజితం రాజా స్థాపయామాస స్వాన్తికమ్ ।**
**రామాద్యా రమయామాసుః స్వస్వదారైః స్వసద్మసు ॥ 389**
**పార్వత్యువాచ**
**శ్రీవిష్ణోస్తు చిదంశేన జామదగ్న్యస్త్వయా స్మృతః ।**
**తద్వచ్ఛాయం రాఘవః కిం నుద మే సంశయం ప్రభో॥ 390**
**శ్రీశివ ఉవాచ**
**అష్టావింశేన విధృతా అవతారాశ్చ విష్ణునా 391**
**రామకృష్ణావతారౌ చ పూర్ణరూపేణ తౌ ధృతౌ ।**
**వసిష్ఠో సకలేష్వేవావతారేషు హి తావుభౌ ॥ 392**
**తయోరపి వరః పూర్వః సత్యసంధో జితేంద్రియః ।**
**జ్ఞేయో రామాతారో హి నానేన సదృశః పరః ॥ 393**
**కృష్ణః కృష్ణరుచిర్ జ్ఞేయః శ్రీరామో రుక్మసంరుచిః ।**
**ఏవం గిరీంద్రజే ప్రోక్తం సీతాయాశ్చ స్వయంవరమ్ ॥**
**అస్య సర్గస్య శ్రవణాన్మంగళం లభ్యతే నరైః 394**

**ఇతి శ్రీశతకోటిరామచరితాంతర్గతే, శ్రీమదానందరామాయణే, వాల్మీకీయే, ఆదికావ్యే, సారకాండే, సీతాస్వయంవరోనామ, తృతీయః సర్గః ॥**

### శ్రీరామాదులు అయోధ్యకు వచ్చుట

అంత దశరథమహారాజు, పరశురాముని ప్రమాదము నుండి బ్రతికివచ్చినట్లు దలచి, గాఢాలింగనముతో, ఆనందభాష్పములతో ఎంతో ప్రీతితో స్వస్థచిత్తుడై రాజధానికి వచ్చెను. రాజు వచ్చు సంగతి తెలిసి, అయోధ్యయందు సుమంత్రాది మంత్రులు అలంకారములచే రాజమార్గములన్నీ శోభాయమానముగా వెలుగుచుండెను. మంత్రులు భద్రగజములతో వచ్చి, స్వాగతము ఒనరింపగా, మంగళ వాద్యములు మ్రోగుచుండగా, మిగుల వేడుకలతో అందరును నగరమున ప్రవేశించిరి. అట్లు అనేక రాజవైభవములతో దశరథుడు తన నగరికి జేరి, తన భార్యలతో శ్రీరామాదులచే లక్ష్మీపూజ చేయించి, అనేక దానములనిచ్చెను. అపుడు మిత్రవర్గపు రాజులు దివ్యాలంకార వస్త్రాదులచే శ్రీరామాదులను, దశరథ

మహారాజును పూజించిరి. దశరథుడును వారినందరిని వైభవముగా సత్కరించెను. అనంతరము అంతా వారివారి స్థలములకు పయనించిరి. దశరథుడు ప్రీతిచే కైకేయి తమ్ముడగు యుధాజిత్తుని తనవద్దనే ఉంచుకొనెను. శ్రీరామాదులు తమతమ పత్నుల తోడ వారివారి రాజమందిరములలో ఆనందించుచుండిరి.” అని శివుడు చెప్పగా, శివవాక్యామృతమును గ్రోలుచున్న పార్వతి,

**శ్రీరామావతార శ్రేష్ఠత్వము**

“పరమేశ్వరా! భార్గవరాముడు శ్రీవిష్ణుమూర్తియొక్క చిదంశమున గలిగినట్లు చెప్పితివే, మరి శ్రీరాముడును విష్ణుమూర్తి అవతారమే గదా? ఈ నా సందేహమును తీర్చుము,” అని అడిగెను. అందుకు శివుడిట్లనెను. (390) శ్రీ మహావిష్ణువుచే 18 అవతారములు ధరింపబడినవి. అందులో రామ, కృష్ణావతారములు రెండును పూర్ణ రూపములై శ్రేష్ఠములనబడుచున్నవి. ఆ రెండింటిలో మొదటిదైన శ్రీరామావతారము మిక్కిలి శ్రేష్ఠము. ఓ గిరిజా! ఇట్లు, సీతా స్వయంవరము చెప్పబడినది. ఈ అధ్యాయ కథాశ్రవణముచేత మానవులు మంగళమునొందుదురు.

**శతకోటి ప్రవిస్తరమైన రామకథలో, శ్రీమద్వాల్మీకి మహర్షిచే రచింపబడిన, ఆనందరామాయణములోని, సారకాండలో, రామకళ్యాణమును వివరించు మూడవ సర్గ ముగిసినది.**

* క్షణములు వ్యర్థముచేయువారు అమూల్యముగు జీవితమునంతను తెలియ కుండగనే వృధాచేసుకొనెదరు.
* ఆశ్రమవాసం చేయగల అదృష్టవంతులవద్ద నేను ఆశించునది. మంచి సమర్ధత, స్వార్ధరహితసేవ నిత్యం ధ్యాన నిమగ్నులై యుండుట. మౌనం బాగా పాటించగలుగుటయును. అందరకు ఆశ్రమ సేవ, నివాసం.. ప్రాప్తించకపోవచ్చును. ఇప్పుడు దైవకటాక్షముచేత లభించిన అమూల్య అవకాశమును సద్వినియోగపరచెదరుగాక!
* ఈ ఆశ్రమ స్థాపన ముఖ్యఉద్దేశ్యము భగవంతునిలో సదా, నివసించుట. ఇతరులు కూడ అట్లు చేయుటకు తోడ్పడగలవారుండాలి. అనగా తాము ధర్మ ప్రవృత్తులైయుండి, ఇతరులను కూడ ధర్మాచరణపరులుగా జేయు దీక్షగలవారుండాలి.
* మానవసేవయే మాధవసేవ యని సదా తలంచుచుండు వారుండాలి.

**– ఓంకార స్వామీజీ**



## నకులమాత

నకులమాత త్రిరత్న శరణు పొందిన ఉపాసకురాలు. ఆమె భర్త కొన్ని నెలలుగా వ్యాధిపీడితుడుగా ఉంటూ క్రమంగా క్షీణించిపోతున్నాడు. ఎక్కువ దినాలు బ్రతకడని తెలుస్తున్నది. ఒకనాడు వకులమాత భర్త దగ్గర కూర్చొని ధైర్యం చెప్పింది: “మీరేమి దిగులు చెందకండి. నా విషయంలోనూ పిల్లల విషయంలోనూ ఏమీ ఆందోళన పడకండి. మీరూ చూస్తున్నారు గదా ఈ ఐదారు నెలలుగా నేనెలా కుటుంబాన్ని నెట్టుకువస్తున్నానో, నాకున్నూ నూలు వడకడం వచ్చు. మగ్గం మీద పనిచేయడం వచ్చు. ఈ పనితనం వల్ల నన్నూ పిల్లల్నీ సులభంగా పోషించుకోగలను. మీరిక నిశ్చింతగా భగవంతుణ్ణి స్మరిస్తూ ఉండండి. భగవంతుణ్ణి శరణు పొందండి. ‘దేవుడా ఇక నీదే భారం. నాదేమీ లేదు. పాలముంచినా నీటముంచినా నీ ఇష్టం. పిల్లిపిల్ల చందాన ఇక నిశ్చింతగా ఉంటాను. నీవు ఎక్కడికి తీసుకుపోయి ఉంచుతావో ఉంచు. ఇన్నాళ్ళు కోతిపిల్లలాగా దూకి దూకి అలసిపోయాను. ఇక నావల్లకాదు. అంతా నీ చేతుల్లో పెట్టేస్తున్నాను’ అని శరణు కోరండి. ‘లోకనాథా, జగద్రక్షకా, పరమేశ్వరా, పరంధామా, శంభోశంకర శివ శివా’ అంటూ భగవంతుణ్ణి స్మరిస్తూ ఉండండి. మరణ భయం వద్దు. దేహానికి బాధ అంతా ఈ ప్రక్కనే. గీటు దాటాక మీకేమీ బాధ ఉండదు. ఆ దాటడం కూడా మీకు తెలియకుండానే జాగ్రత్త నుండి స్వప్నానికి దాటినట్లుగా జరిగిపోతుంది. మళ్ళీ ఇదే దేహం, ఇదే మనస్సు, ఇదే పరిసరాలు, ఇదే లోకం రానేరాదు. సృష్టిలో పునరుక్తి (repetition of the same thing) లేదు. కనుక గీటుకు ఇవతలి ఏ విషయంలోనూ ఆసక్తి వద్దనే వద్దు. మళ్ళీ మీరు ఇక్కడికి వచ్చి ‘లోకం ఎలా ఉంది? నన్ను గురించి జనాలు ఏమనుకొంటు న్నారు?’ అని తొంగి చూడబోయేది లేదు. మనం అందరం దారిమధ్యలో ఒకరికొకరం తారసపడి కొంత దూరం కలిసి నడిచాము. సమయం వస్తే ఎవరి దారిన వారు వెళ్ళిపోవలసినవారమే ఈ కాస్తదానికి లేనిపోని అహంకారాలు మమకారాలు ఎందుకు? భగవంతుని శక్తే మనలో పని చేసేది. అదే లేకపోతే గడ్డిపోచను కూడా వంచలేము. సర్వం తానే అయిన ఈ పరమేశ్వరుణ్ణి ప్రార్థించండి.

**తమసో మా జ్యోతిర్గమయ అని ప్రార్థించండి**
**అసతో మా సద్గమయ అని ప్రార్థించండి**
**మృత్యోర్మా అమృతం గమయ అని ప్రార్థించండి.**

మీకు భగవంతుడు కనబడకపోయినా వినబడక పోయినా ప్రార్థన చేయండి. మీకు తోచిన మాటల్లో భక్తితో ప్రార్థించండి. ఆయనకు వినబడుతుంది.

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్**
**ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మాఽ మృతాత్**

**ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ పురుషం కృష్ణపింగళం**
**ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయ వై నమః**

అని భగవంతుణ్ణి స్మరించే శ్లోకాలు చెప్పి భర్త మనస్సును దేవుని మీదికి మళ్ళించింది. ఆ తరువాత మూడు రోజులకు భర్త చనిపోయాడు. నకులమాత 'లబోదిబో' అని ఏడవలేదు. అక్కనపక్కన ఉన్నవాళ్ళే కొందరు స్త్రీలు శవాన్ని చూసి వాళ్ళ జీవితంలోని వియోగ సంఘటనల జ్ఞాపకాలు హృదయాన్ని కెలకగా కంట తడి పెట్టారు. నకులమాత భర్త పోయాడని కాదు. నకులమాత, భర్త శవాన్ని ఎక్కువసేపు ఇంటివద్ద ఉంచలేదు. శ్మశానానికి వేగిరంగానే చేర్చివేసి దైనందిన పనుల్లో నిమగ్నమయింది. ఒక ముసలావిడకు నకులమాత మనస్సు, గతి తప్పిందేమో (abnormal) అనిపించి "ఏమ్మా, భర్తపోతే నీకు చీమ కుట్టినట్లైనా లేదే" అనింది. "నా జీవిత క్రీడారంగంలో భర్తతో ఆడవలసిన క్రీడ (game) ఆ క్షణంతో ముగిసింది. ఆ ఆట అయ్యాక కూడా "అది ఇంకా కొనసాగిఉంటే బాగుండును కదా" అని వాస్తవాలకు విరుద్ధంగా ఆలోచిస్తూ ఏడుస్తూ ఉండమంటావా? ఆ పైన ఆడవలసిన ఆటల సంగతి ఏమిటి? ఏడుస్తూ కూచుంటే బాగా ఆడగలనా? బుద్ధభగవానుడు చెప్పిన నియమాలు పాటిస్తూ ఇంకా ఆడవలసిన ఆటలుఆడుతూ పోవడమే. నాకూ ఏడుపు వస్తుంటుందిలే. కడుపునొప్పి వస్తేనో పెద్ద గాయం తగిల్తేనో" అనింది నకులమాత.

నకులమాతకు ఇద్దరు పిల్లలు. వాళ్ళను చక్కగా పెంచి పెద్దజేసింది. "ఇతరులతో మిమ్మల్ని పోల్చుకొంటూ జీవించకండి. మీకు మీరుగా జీవించండి. ఎవరినీ అనుకరించకండి (imitate చేయకండి). కమలం ఒక విధంగా మల్లె ఒక విధంగా గులాబీ ఒక విధంగా ఉంటాయి. ఒకదాన్ని ఒకటి అనుకరించవు. అలాగే మీరూ మీ మీ స్వభావానుసారంగానే జీవితంలో వికసించండి" అని ఉద్బోధిస్తూ ఉండేది. అమ్మాయి పెద్దయ్యాక ఆమె కోరుకున్న వరునికిచ్చి పెండ్లి చేసి పంపివేసింది. అబ్బాయి జేతవనం వెళ్తానన్నాడు. "మంచిది, వెళ్ళు నాయనా" అనింది. అబ్బాయి పేరు నకులుడు.



నకులుడు 18వ ఏట జేతవనంలో చేరాడు. 26వ ఏట భిక్షువయ్యాడు. మరో రెండేండ్లు కొనసాగాడు. ఆ తరువాత అతని జీవితంలో ఒక విధమైన ఆకర్మణ్యత (stagnation) ఏర్పడిపోయింది. యాంత్రికంగా నీరసంగా అభివృద్ధి శూన్యంగా జీవిస్తున్నాడు. పారాజికలలో✷ (defeats) మొదటి పారాజిక మీద ఎక్కువ ఆలోచన చేస్తున్నాడు.

వాస్తవంగా (in actuality) ఎదురయ్యే సమస్యకన్నా ఆలోచనతో ఎదురయ్యే సమస్యే పెద్ద భూతంలాగా ఉంటుంది. "జీవితాంతం ఇలాగే ఉండిపోవాలి గదా" అనే ఊహ అతని పాలిట భూతం అయ్యింది. ఒకనాడు నకులుడు రంగు వేయని రెండు గుడ్డలను చంకలో పెట్టుకొని జేతవనం వదలి ఇంటికి వెళ్ళిపోయాడు.

నకులుడు రెండు వారాలకు పైగా ఇంటివద్దే ఉన్నాడు. వేళవేళకు ఇంటికి వచ్చి తల్లిచేతి భోజనం తృప్తిగా తిని ఎక్కడికో వెళ్ళిపోయేవాడు. "ఎక్కడికి పోతున్నావు? ఎక్కడ్నుంచి వస్తున్నాడు? రాత్రి ఎక్కడున్నావు?" ఇలాంటి ప్రశ్నలు ఏమీ నకులమాత అడగలేదు. ఒకనాడు నకులుడు తల్లి పాదాలకు నమస్కరించి "అమ్మా నేను జేతవనం వెళ్ళి ఒకటో తరగతిలో మళ్ళీ చేరుతాను ఆశీర్వదించు" అన్నాడు. "అనివర్తుడవై వర్ధిల్లు నాయనా" అని దీవించింది. నకులుడు అప్పటికి పదేండ్లు జేతవనంలో ఉండినవాడైనప్పటికీ అతణ్ణి కొత్తవానిలాగే తీసుకొని ప్రవ్రజ్య ఇచ్చి ఒకటో తరగతికి పంపారు. "ఒకటో తరగతిలో చేరవలసివచ్చిందే" అని అతను కౌకృత్యం (regret) అణుమాత్రం కూడా చెందలేదు. హోదాలు, పదవులు, అధికారాలు, గుర్తింపులు, యోగ్యతాపత్రాలు కాదు తనకు కావలసింది. అదంతానూ అతని దృష్టిలో పరమ చెత్త. ఆధ్యాత్మ వికాసమే (inward flowering) అతనికి పరమ ముఖ్యం. ఎనిమిదేండ్ల తరువాత అతనికి మళ్ళీ ఉపసంపద దీక్ష ఇచ్చారు. నకులుడు శేషజీవితాన్ని అనివర్తుడు గానే (వెనక్కి తిరిగిరానివాడు= non back slider) జీవించాడు.

ఒకనాడు నకులమాత ప్రస్తావన వచ్చినపుడు బుద్ధుడు క్రింది శ్లోకాలు చెప్పాడు.

**సంప్రబుద్ధం ప్రబుధ్యంతే సదా గౌతమశ్రావకాః**
**యేషాం దివా చ రాత్రౌ చ నిత్యం బుద్ధగతా స్మృతిః 21-7**

**సంప్రబుద్ధం ప్రబుధ్యంతే సదా గౌతమశ్రావకాః**
**యేషాం దివా చ రాత్రౌ చ నిత్యం ధర్మగతా స్మృతిః 21-8**

**సంప్రబుద్ధం ప్రబుధ్యంతే సదా గౌతమశ్రావకాః**
**యేషాం దివా చ రాత్రౌ చ నిత్యం సంఘగతా స్మృతిః 21-9**

సంప్రబుద్ధం ప్రబుధ్యంతే సదా గౌతమశ్రావకాః
**యేషాం దివా చ రాత్రౌ చ నిత్యం కాయగతా స్మృతిః 21-10**
సంప్రబుద్ధం ప్రబుధ్యంతే సదా గౌతమశ్రావకాః
**యేషాం దివా చ రాత్రౌ చ అహింసాయాం రతం మనః 21-11**

బుద్ధానుస్మృతి (mindfulness) ధర్మానుస్మృతి, సంఘానుస్మృతి, కాయగతస్మృతి (mindfulness of body) అహింసారతి (delight in being compassionate) ఎల్లవేళల కలిగియున్నట్టి గౌతముని శిష్యులు సంప్రబుద్ధులనియే (well awakened) చెప్పవలెను. వాళ్ళు ఎల్లప్పుడూ జాగరూకులై (ever arise) ఉంటారు.

**Note:** కొందరు puritans నకులమాత నచ్చకపోవచ్చు. ఆమెను ఉపాసకురాలుగా చెప్పడం, మళ్ళీ లోనే old culture ఆమెను ఉంచడం నచ్చకపోవచ్చు. నాకున్న కొద్దిపాటి చారిత్రక అవగాహన ఆధారంతో నకులమాతను చిత్రించాను. బౌద్ధానికి ఇతర మతసంప్రదాయాలకు చాలా వ్యత్యాసం ఉన్నది. అసలు బౌద్ధాన్ని మతం అనడం మహాపచారం. వాడుకలో ఉన్న పదమని వాడడమే. ఉపాసకులకు పంచశీల మరికొన్ని నియమాలు మాత్రం చెప్పి వాళ్ళను first class citizens చేయడం వరకే బౌద్ధం చేసింది. స్వంత సంస్కృతిని పాతిపెట్టి వేరే సంస్కృతిని దిగుమతి చేసుకోమని బౌద్ధం కోరదు. వేషం, భాష వగైరా వాటిని మార్చుకోవాలని కోరదు. ఆచార వ్యవహారాలను మార్చుకోవాలని కోరదు. ఒక్కమాటలో చెప్పాలంటే చుట్టూ వున్న లౌకిక వ్యవస్థలో (secular field) ఘర్షణ పడలేదు (worldly interests) ప్రధానంగా కలిగిఉంటేనే ఘర్షణ. బౌద్ధం unworldly కనుక ఏ లౌకిక వ్యవస్థ తోనూ ఘర్షణ పడలేదు. కులవ్యవస్థ మీద ధ్వజం ఎత్తినట్లుగానూ మనకు కనిపించదు. కేవలం భిక్షుసంఘం వరకు అది లేకుండా చేసుకోవడం మాత్రం జరిగింది. భర్తృహరి (సుభాషిత గ్రంథకర్త) ఏడుసార్లు శైవాన్నుండి బౌద్ధానికి బౌద్ధాన్నుండి శైవానికి మారినట్లు కథ ఉన్నది. నకులుడు ఒకసారి మాత్రం బైటకు వెళ్తే భర్తృహరి ఏడుసార్లు వెళ్ళి వెళ్ళి వచ్చాడు. శృంగార శతకం వ్రాయకముందా వ్రాశాకనా చెప్పడం కష్టం. వాక్యపదీయం వ్రాసిన భర్తృహరి కూడా ఇతనే అని చెబితే మరీ మంచిదే. వాక్యపదీయం రచించిన చోటు నలంద విశ్వవిద్యాలయం. అమరకోశం వ్రాసిన అమరసింతహుడు బౌద్ధుడే. ఏ విశ్వవిద్యాలయం వాడోతెలియదు. కాశికావృత్తి కారుడూ బౌద్ధుడేనట!



## దక్షిణామూర్తి స్తోత్రం

## మానసోల్లాసం -14

**(మే సంచిక తరువాయి)** **వ్యాఖ్యాత - వింజమూరి రాధాకృష్ణ**

వైశేషికకుల ప్రాథమిక భావాలను తెలిపిన పిదప సూరేశ్వరాచార్యులవారు సాంఖ్య శాస్త్రము యొక్క ప్రాథమిక భావాలను తెలిపిరి. మూల ప్రకృతిని మాయ, ప్రధానము, అవ్యక్తము, అవిద్య, అజ్ఞానము, అవ్యాకృతం-అని అనేక పర్యాయపదాలతో సాంఖ్యులు వ్యవహరింతురు అని గత శాంతి పత్రికలో తెలుసుకున్నాము. సాంఖ్యులయొక్క ఇతర ప్రాథమిక అంశాలను సూరేశ్వరాచార్యుల వారు 40 వ శ్లోకం వరకు వివరించిరి. ఆ పథములోనే మన పరిశీలన కొనసాగిద్దాము.

**32. మాయాయాం బ్రహ్మ చైతన్య ప్రతిబింబానుషంగతః**
**మహత్కాల పుమాంసః స్యుః మహాత్తత్త్వాదహంకృతిః**

మాయాయాం= మాయలో, బ్రహ్మ చైతన్య ప్రతిబింబానుషంగతః,= బ్రహ్మ చైతన్య ప్రతిబింబ సంపర్కం చేత, మహత్కాల పుమాంసః= మహత్తు కాలము పురుషుడు అను తత్వములు స్యుః = అగును, మహాత్తత్త్వాత్= మహా తత్వము నుండి అహంకారము పుట్టుచున్నవి.

మాయ యందు బ్రహ్మ చైతన్యం యొక్క ప్రతిబింబముతో ఏర్పడిన సంపర్కం వలన ఈ క్రింది తత్వములు పుట్టుచున్నవి. అవి వరుసగా 1. మహత్తు 2. కాలము 3.పురుషుడు. పిదప మహాత్తత్త్వము నుండి అహంకారము పుట్టుచున్నది.

ఈ శ్లోకములో సాంఖ్యభావాలననుసరించి సృష్టి క్రమాన్ని తెలపడం జరిగింది.

**33. తామసత్స్యురహంకారాత్ఖానిలాగ్నం**
**శబ్దస్స్పర్శశ్చరూపం చ రసోగంధోఽప్యనుక్రమాత్**

**34. ఇంద్రియాణాం చ విషయాభూతనామపితే గుణః**
**దేవాఃసదాశివశ్చేశోరుద్రోవిష్ణుశ్చతుర్ముఖః**

తామసత్ = తామసమైన, అహంకారాత్= అహంకారమునుండి, అనుక్రమాత్= క్రమముగా ఖానిలాగ్నింభూమయః= ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అను పంచభూతములు, శబ్దః=శబ్దము,స్పర్శః=స్పర్శ=మరియు, రసః= రసము, గంధః=గంధము,స్యుః=కలుగును,తే=అవి, ఇంద్రియాణాం= ఇంద్రియముల,

విషయాః =విషయములు అపిచ=మరియు, భూతానాం=భూతముల, గుణాః,= గుణములు, సదాశివః = సదాశివుడు, చ= మరియు, ఈశః= ఈశ్వరుడు, రుద్రః= రుద్రుడు, విష్ణుః= విష్ణువు, చతుర్ముఖః =బ్రహ్మ, దేవాః= దేవతలు కొలువగుచున్నారు.

తమస్సు, అహంకారము నుండి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అను పంచభూతములు వాని నుండి క్రమముగా ఆకాశము నుండి శబ్దము, వాయువు నుండి స్పర్శ, అగ్నినుండి రూపము, జలము నుండి రసము, భూమి నుండి గ్రంధము కలుగుచున్నవి. ఈ శబ్ద స్పర్శ రూప రస గంధాలు పంచేంద్రియములుగా ఏర్పడి పంచభూతముల గుణములను కలిగి ఉన్నవి వీనికి వరుసగా ఆకాశమునకు సదాశివుడు, వాయువుకి ఈశ్వరుడు, అగ్నికి రుద్రుడు, జలమునకు విష్ణువు, భూమికి బ్రహ్మ అధిదేవతలుగా ఉన్నారు.

**35. సాత్వికాత్యదహంకారాదంతః కరణధీంద్రియమ్**
**మనోబుద్ధిరహంకారశ్చిత్తంకరుణమాంతరం**

**36. సంశయో నిశ్చయో గర్వస్మరణం విషయాఅమీ**
**చంద్రః ప్రజాపతిరుద్రః క్షేత్రజ్ఞ ఇతి దేవతాః**

సాత్వికాత్=సాత్వికమైన, అహంకారాత్ = అహంకారము నుండి, అంతఃకరణ ధీంద్రియం=శరీరము లోపల భాగములై ఇంద్రియములుగా యున్న జ్ఞానేంద్రియములు, స్యాత్=కలుగును, అంతరం=లోపలి, కరణం=సాధనము, మనః= మనసు, బుద్ధిః= బుద్ధి, అహంకారః = అహంకారము, చిత్తం = చిత్తము, సంశయః = సందేహము, నిశ్చయః = నిశ్చయము, గర్వః= గర్వము, స్మరణం = జ్ఞాపకముంచుకొనుట, అమీ= ఇవి, విషయః = క్రమముగా అంతఃకరణ విషయములు, చంద్రః= చంద్రుడు, ప్రజాపతిః= ప్రజాపతి, రుద్రః= రుద్రుడు, క్షేత్రజ్ఞః= క్షేత్రజ్ఞుడు, ఇతి= అనువారు, దేవతాః= దేవతలు.

సాత్విక అహంకారమునుండి అంతఃకరణములైన జ్ఞానేంద్రియములు ఏర్పడుచున్నవి. ఇచ్చట అంతఃకరణము అనగా మనసు, బుద్ధి, అహంకారము, చిత్తము, వీనికే క్రమముగా సంశయము, నిశ్చయము, గర్వము, స్మరణ విషయములుగా ఉండును. వీనికి వరుసగా చంద్రుడు, ప్రజాపతి, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు దేవతలుగా ఉన్నారు.



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్**
**(గత సంచిక తరువాయి)**

**తపోనిష్ఠ**

**వివరణ : సాయికృష్ణ**

**ప్రతిజీవిని లోపల, స్వస్వరూపమై, నిత్యమై, అవికార్యమయిన సత్యజ్ఞానము దివ్యానుగ్రహ సంపదగా నిలిచియున్నది. ఈ సంపద నీలోపల అణగియున్నదని తెలిసికొని, దానిని సంపూర్ణముగా అనుభవగోచరము కావించుకొనుటయే తపస్సు యొక్క ఉద్దేశ్యము. అంతేగాని, దానిని (అజ్ఞానము) నూతనముగా సృష్టించుటకాదు.**

**అవికార్యము :** ప్రపంచములోని వస్తువులు కారణము. వాటిని మనకు అనుకూలముగా మార్చుకొనుట కార్యము. కారణము కార్యముగా కనిపించవచ్చు. మట్టి కారణము. కుండ కార్యము. నీలోపల ఉన్న నీ స్వరూపమయిన సత్యజ్ఞానము దివ్యానుగ్రహ సంపదగా నీకు ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానమే గొప్ప సంపద ఇది ప్రతీ జీవి లోపల ఉంది ఇదే అవికార్యము. ఇది కొత్తగా ఏవో కారణము చేత మనకు లభించేది కాదు. ఇది స్వతః సిద్ధం. దీనిని ఎవరూ కొత్తగా సృష్టించలేదు. అది సహజ సిద్ధముగా నీ స్వరూపములో ప్రకాశిస్తున్నది. ఆ సంపద మనలో ఉన్నదని తెలుసుకొని ఆ సంపదను సంపూర్ణముగా అనుభవము లోనికి తెచ్చుకోవాలి. కార్యము ద్వారా వచ్చిన కారణము శాశ్వతము కాదు. నీవు మరచిన నీ స్వరూపాన్ని గుర్తుచేసుకొని, దాని కొరకే దృష్టిపెట్టి చేసే సాధనయే తపస్సు.

**పంచేంద్రియములలో కూడి, (అటు ఇటు) సంచరించకుండ అజ్ఞాన రూపమయిన అహంతను – మనస్సును – హృదయము లోపల నిరోధించి, అక్కడనే బంధించి యుంచి, శుద్ధ శివస్వరూప నిష్ఠమై యుండునట్లు చేయుటయే నిజమయిన తపో లక్షణము. ఉత్తమ తపోనిష్ఠులయినవారు ఇట్లు చెప్పుదురు.**

తపస్సు యొక్క మూల అర్థము తపించిపోవడము. నాకు ఆత్మానుభవం కావాలి, నా స్వరూపమును నేను తెలుసుకోవాలి. ఆత్మజ్ఞానం కావాలి అని బాగా తపించడమే తపస్సు. ముముక్షువు యొక్క తపస్సు మోక్షము మాత్రమే కావాలని. దృష్టి, శ్రద్ధ, ప్రయత్నం అన్నీ అది సాధించడంలోనే ఉంటాయి. నాకు అదే కావాలనే బుద్ధే తపస్సు. తపన పెరిగితే భగవంతుడు మార్గం చూపిస్తాడు. ఆ మార్గంలో ప్రయాణం చేస్తే చివరకు ఆత్మానుభవం పొందుతారు. తపన అనేది చాలా చాలా అవసరం.

**అజ్ఞాన కారణముగా గోచరించెడి భేదమయ జగద్దృశ్యము లన్నింటిని**

**వశపరచుకొని, వానిని ఆత్మకారణముగా పరివర్తితమొనర్చి, ఆత్మ వృత్తి ప్రకాశించు చున్నది. విషయమును పరిశీలించి చూచినచో, ఆత్మవృత్తి ప్రవాహము నిరంతరముగా అఖండముగా నుండుటయే ఆ సమానమగు ఉత్తమ తపోలక్షణము.**

ఆత్మను గురించి ఆలోచించు, విను, మాట్లాడు అని శాస్త్రము చెబుతోంది. ఎప్పుడు మన దృష్టిని ఆత్మ మీదనే ఉంచడం ఉత్తమ తపోలక్షణము మనం ఆత్మద్వారా, శరీరము ద్వారా మనస్సు ద్వారా ప్రయత్నములు చేస్తూ ఉంటాము. మనము కోరే అనేక విషయాలలో ఆత్మజ్ఞానము ఒకటి అనే భావము కాకుండా ఆత్మపైనే దృష్టి పెట్టాలి. ఆత్మ గురించి మన ఆలోచనలు నిరంతరం సాగుతూ ఉండాలి. ఎల్లప్పుడూ ఆత్మని గురించి విచారణ చేస్తూ ఉంటే మన మనస్సు ప్రాపంచిక విషయాల వైపుకు పోకుండా ఉంటుంది. ఆత్మ జ్ఞానం తప్ప మరొకటి అవసరం లేదనే పట్టుదల, దృష్టికావాలి దృశ్య విషయాలు లేకుండా పోయినప్పుడు ఆత్మ వృత్తి మాత్రమే మిగులుతుంది. ఆత్మవృత్తి (ఆలోచన) లేనిదే అజ్ఞానం నశించదు. ఆత్మ గురించి ఆలోచనలో ఏకాగ్రత, పట్టుదల తగ్గినచో లౌకిక విషయముల మీద ఆ శక్తి విజృంభిస్తుంది. ఎంతో ఉన్నతస్థానయిలో ఉన్నవారు కూడా ఏదో ఒక ప్రాపంచిక విషయంలో చిక్కి పతనమవుతున్నారు.

**అపారమయిన బ్రహ్మానంద సాగర జలములు అన్నివైపుల వ్యాపించి యుండగా, మహా భయంకర దుఃఖాగ్నిలోనికి తాను త్రోయబడినట్లు, ఆ అగ్ని జ్వాలలు తనను చుట్టుముట్టినట్లు భావించుట కేవలము భ్రాంతి. విధిగా తలచి మాత్రమే తపస్సు చేయుచు, దానిపట్ల ప్రీతి లేకపోవుటయే ఇందుకు కారణము. ఇది మూఢత్వమని జ్ఞానులు చెప్పుచున్నారు.**

ఎవరో చెప్పారని, చేశారని కాకుండా, ఇష్టంతో సాధన చేయాలి. ఆత్మానుగ్రహం కలగాలనేదే ఉత్తమమయిన స్వార్థము. నేను తరించవలెననే భావనయే మహాస్వార్థము. సాధకులకు, మనుష్యులకు, జిజ్ఞాసువులకు నేను ఈ జన్మలోనే తరించాలనే స్వార్థమే ఉండి తీరవలసినది. అప్పుడు శ్రద్ధ, ప్రీతి ఏర్పడుతుంది. దీర్ఘకాలము, నిరంతరము, ఇష్టముగా సాధన చేయాలని పతంజలి చెప్పారు. నన్ను నేను ఉద్ధవించుకొనుటకే సాధన చేస్తున్నాను అనే తపన సాధకులకు ఉండాలి.

**(సశేషం)**



# ఏకజీవ వాదము

**–స్వామి బోధాత్మానంద**

మరొక ముఖ్యమైన సిద్ధాంతం ఏకజీవ వాదము. ఏకజీవ అనగా ఒకే జీవుడు ఉన్నాడు. సాధారణంగా మనం బహుజీవవాదమును అర్థం చేసుకుంటాము. అనేక జీవులు ఉన్నారు అని భావిస్తాము. అనేక ఆత్మలున్నాయి, ప్రతీ ఆత్మ వేరుగా ఉంటుంది. ప్రతీ ఆత్మ దానియొక్క ప్రయాణాన్ని కొనసాగిస్తుంది. సాధారణంగా ఇటువంటి ఆలోచన మనకు సౌకర్యవంతంగా ఉంటుంది. అనేక ఆత్మలున్నాయా? లేదా? అనేక జీవులున్నారా? లేదా ఒకే జీవుడున్నాడా? అనేటువంటి ప్రశ్నలు సామాన్యంగా మనం అడుగము. వేదాంత ఆచార్యులు దీనిని గురించి ఆలోచించి చర్చించారు. ఈ విచారణ చేస్తున్నవాళ్ళలో మనం మొదటివాళ్ళము కాదు. ఈ ఏకజీవ వాదము అంటే ఏమిటి? ఒకవేళ మనం స్వప్నంను ఉదాహరణగా తీసుకున్నట్లయితే ఏకజీవవాదంను ఉపయోగించాలి. జాగ్రత్ మిథ్యా అని నిరూపించడానికి మనం స్వప్నంను ఉదాహరణగా తీసుకుంటున్నాము. స్వప్నంలో ఒక వ్యక్తి ఉన్నాడు, అతను స్వప్నంను చూస్తున్నాడు. అనుభవిస్తున్నాడు. అందులో అనేక జీవులను సృష్టిస్తున్నాడు. కానీ ఆ జీవులలో చైతన్యం లేదు. ఈ స్వప్న అనుభవజ్ఞుడు, స్వప్న పురుషుడు మాత్రమే చేతన వస్తువు అనగా చైతన్యాన్ని కలిగి ఉన్నాడు. స్వప్నంలో ఉన్న ఇతర జీవులందరూ స్వతహాగా చైతన్యాన్ని కలిగిలేరు, స్వప్న పురుషుడి నుండి చైతన్యాన్ని పొందారు. ఎందుకనగా ఆ జీవులు ఏం చేస్తున్నారు. ఏం ఆలోచిస్తున్నారు అనేది ప్రాథమికంగా స్వప్న పురుషుడి యొక్క చైతన్యం ద్వారానే నిర్ణయించబడుతుంది. ఏకజీవ వాదము జీవుడు ఒక్కడే ఉన్నాడు అని చెబుతుంది. ఆ జీవుడు నేను అని అర్థం చేసుకోవాలి. నేను ఈ ఉత్పత్తి లేదా సృష్టి యొక్క హిరణ్యగర్భును, నేను హిరణ్యగర్భను అనగా నేను సమిష్టి సూక్ష్మ శరీరస్థాయిలో పనిచేస్తున్న సార్వత్రిక జీవిని, అనగా సమిష్టి సూక్ష్మశరీరం, సమిష్టి బుద్ధి ఇవన్నీ 'నేను' అదే ఏకజీవుడు. ఈ ప్రపంచం అంతా నా యొక్క కల్పన, హిరణ్యగర్భ యొక్క కల్పన. ఒక వ్యక్తి స్వప్నంను చూస్తున్నాడు. ఆ స్వప్నం అతని యొక్క కల్పన, స్వప్నంలో ఉన్న వస్తువులన్నీ అతని కల్పన, వ్యక్తులందరూ అతని కల్పన, అదే విధంగా ఈ ప్రపంచం అనేది హిరణ్యగర్భయొక్క కల్పన, హిరణ్యగర్భ ఏకజీవ. నేను చూస్తున్న అనేకమంది వ్యక్తులు వారి సంగతి ఏమిటి? వాళ్ళంతా సూక్ష్మశరీరాలు మాత్రమే. వాళ్ళకు చైతన్యం లేదు, వాళ్ళల్లో ఉన్న చైతన్యం ఏదైతే ఉందో ఆ చైతన్యం యొక్క సత్యత్వాన్ని తాత్కాలికంగా నేనే ఇచ్చాను.

ఒకే జీవుడు, ఒకే అవిద్యా. బ్రహ్మ మరియు అవిద్యా కలిస్తే జీవుడు అంటారు. జీవుడు ఒక్కడే. ఇది ఏకజీవ వాదంలో అభివృద్ధి. బ్రహ్మ అవిద్యా మూలంగా

తనను తాను జీవుడుగా భావిస్తాడు/ సమిష్టి జీవుడు మరియు ప్రపంచము లేదా సృష్టి అతని యొక్క కల్పన అనగా ఇది అతని దృష్టి/జ్ఞానం. ఎంత కాలం ఈ జగత్ ఉంటుంది? జీవుడు కొనసాగినంత కాలం ఉంటుంది. ఎందుకంటే ప్రపంచమనేది అతని యొక్క స్వప్నం. స్వప్నంలో లాగా అనుభవాలన్నీ కొనసాగుతూనే ఉంటాయి. ఏకజీవవాదము స్వప్న దృష్టాంతం ద్వారా అనుభవాలన్నీ కూడా సమర్థించబడినవి, అద్వైత వేదాంతాన్ని వ్యతిరేకించే ప్రశ్నలు, అభ్యంతరాలు, పూర్వపక్షములు అన్నీ పరిష్కారం చేయబడ్డాయి. ఎవరైతే జగత్ మిథ్యా నా యొక్క స్వరూపం బ్రహ్మ అని నిరంతరం ఆలోచించాలి అనుకుంటారో ఈ రెండు దృష్టి-సృష్టి వాదము మరియు ఏకజీవ వాదము రెండూ కూడా అత్యంత ముఖ్యమైనవి.

ఈ సిద్ధాంతాలను తెలుసుకోవడంలోను, ఆలోచించడంలోను ఉన్న లక్ష్యం ఏకజీవ వాదములో కూడా ఏకజీవుడు లేదా హిరణ్యగర్భ అతను పూర్వం చేసిన మహత్త్వమైన పుణ్యకర్మల వలన ఎక్కువకాలం అజ్ఞానిగా ఉండడు. ఏకజీవుడుగా ప్రారంభించి అతనే బ్రహ్మగా తెలుసుకుంటాడు.

ఇప్పుడు దృష్టి-సృష్టి వాదము యొక్క నిర్వచనం ఏమిటో చూద్దాము. దృష్టి అనగా జ్ఞానము. సృష్టి అనగా ఉత్పత్తి అని మీరు గుర్తుంచుకోవాలి. జ్ఞానము మరియు ఉత్పత్తి రెండూ ఒకటేనా లేదంటే జ్ఞానం కంటే ఉత్పత్తి వేరుగా ఉందా? జ్ఞానంలో రెండు అంశాలున్నాయి. 1. వృత్తి (ఆలోచన) అంశం 2. చైతన్య అంశం. దృష్టిగా వృత్తి అనేది ఉత్పత్తా (సృష్టి) లేదా చైతన్యము ఉత్పత్తా? వాళ్ళు ఈ రకంగా వికల్పాలను సృష్టించినప్పుడు మీరు ఏ సమాధానం ఇచ్చినా చిక్కుకుపోతారు అని మీరు అర్థం చేసుకోవాలి. మొదటి వికల్పము-ఒకవేళ నీవు వృత్తి అనేది ఉత్పత్తి అని చెబితే, దృష్టి-సృష్టి అంతే గుర్తుందా, దృష్టి ఏదైతే ఉందో ఆ సృష్టి మిథ్యా ఎందుకంటే మన ఉదాహరణలన్నీ స్వప్న, రజ్జుసర్ప, శుక్తిరూప్య మొ. అందువలన ఎక్కడైతే దృష్టి-సృష్టి వర్తిస్తుందో ఆ వస్తువు మిథ్యా అవుతుంది. కేవలం జ్ఞానం ఉన్నప్పుడు మాత్రమే ఈ వస్త్రం ఉత్పత్తి అయింది అని నేను అంటున్నాను కాబట్టి మిథ్యా, ఈ ఘటం (కుండ) నేను అనుభవిస్తున్నప్పుడు ఉంది, అనుభవంలో లేనప్పుడు లేదు అందువలన ఇది మిథ్యా (దృష్టి-సృష్టి). ఒకవేళ నీవు దీనిని (దృష్టి- సృష్టి) ఉపయోగిస్తే బ్రహ్మను తెలుసుకోవాలంటే బ్రహ్మాకార వృత్తి ద్వారా తెలుసుకుంటున్నాము. ఒకవేళ వృత్తి ఎక్కడైతే ఉందో అది సృష్టి అని నీవు అంటే, వృత్తిరూప దృష్టి ఏవ సృష్టిః, బ్రహ్మాకార వృత్తి కూడా ఉంది. అప్పుడు బ్రహ్మ కూడా దృష్టి-సృష్టిలో భాగమే. బ్రహ్మ కూడా మిథ్యా అవ్వాల్సి వస్తుంది. కాబట్టి దృష్టిగా వృత్తి సృష్టి (ఉత్పత్తి) అని చెప్పలేము. ఇది ఒకటి.

మరొకటి చైతన్యము అనుకుందాము. దృష్టిగా చైతన్యము సృష్టి (ఉత్పత్తి)



అనుకుంటే, అన్ని సమయాలలోనూ చైతన్యము ఉంటుంది. అన్ని సమయాలలోనూ సృష్టి ఉంటుంది. అంగీకరించదగినది కాదు. దృష్టి అనగా జ్ఞానమే సృష్టి అని దీని ద్వారా ఏం తెలియజేస్తున్నారు. అలాగే దృష్టి ఏవ సృష్టి అనగా ఏమిటి అని మనం అర్థం చేసుకోవాలి. మనం మరొక నిర్వచనం తీసుకుందాం, ఒకవేళ దృష్టి కంటే వేరుగా సృష్టిగా తెలుస్తున్న వస్తువనేది లేదు. అనగా ఆ వస్తువనేది సృష్టిలోనే ఉంది. దృష్టి వ్యతిరేకేన సృజ్య అభావ-సృజ్య అనగా ఉత్పత్తి అయినది. నేను అంగీకరించాలనుకునేది జ్ఞానము కంటే వేరుగా వస్తువనేది ఉంది అనికాదు. సాధారణ వ్యక్తి భాషలో అన్ని వికల్పాలు ఒకేలా అనిపిస్తాయి, ఏదైనా సరే, అవును, నీవు చెప్పేది వాస్తవం. దృష్టి వ్యతిరేకేన సృజ్య అభావ. దృష్టి అనగా జ్ఞానం. ఘట (కుండ) జ్ఞానం తీసుకుందాం. ఘట జ్ఞానము కంటే వేరుగా ఘటము ఉందా లేదా? సిద్ధాంతి ఘట జ్ఞానం కంటే వేరుగా ఘటము లేదు అంటున్నాడు. ఎందుకంటే శుక్తిరూప్య విషయంలో జ్ఞానము కంటే వేరుగా శుక్తిలో రజతము అనేది లేదు. జ్ఞానము మాత్రమే ఉంది, వస్తువు లేదు. స్వప్నంలో నేను ఏనుగును చూసినచో జ్ఞానము మాత్రమే ఉంది, ఏనుగు లేదు. అటువంటి సందర్భంలో ఒకవేళ మనం జాగ్రత్ జగత్ అనేది దృష్టి-సృష్టి అని చెబితే జ్ఞానానికి వేరుగా వస్తువనేదే లేదు, కానీ మన అనుభవం ఇది కాదు. మన అనుభవం ఆ వస్తువు వేరు, జ్ఞానం వేరు. విషయముగా ఘటము వేరు, విషయజ్ఞానము వేరు, ఘటము బాహ్య దేశములో ఉంది, జ్ఞానము అంతరదేశములో ఉంది, రెండూ ఒకటని ఎలా చెబుతారు?

వీటన్నింటిని మనం విచారిద్దాం. మొదటగా ఈ దృష్టి-సృష్టి వాదములో ఎన్ని అభ్యంతరాలు రావడానికి అవకాశం ఉందో అర్థం చేసుకుందాము. దృష్టి-సృష్టి అనేది సమానకాలంలో మాత్రమే ఉంటుందా (దృష్టి సమానకాలీన సృష్టిః)? దృష్టి-సృష్టి అనేది దృష్టి సమాన కాలీన సృష్టి అని నీవు నిర్వచించబోతున్నావా? ఎందుకంటే ఒకవేళ నీవు రజ్జు సర్పదృష్టాంత (ఉదాహరణ) కు ఈ లక్షణాన్ని అన్వయిస్తే అక్కడ ఇది వర్తిస్తుంది. దృష్టి (జ్ఞానం) ఉండగా అదే సమయంలో సృష్టి ఉంది. కానీ అదే లక్షణాన్ని నీవు వ్యావహారిక జగత్‌కు అన్వయిస్తే ఇక్కడ ఆ లక్షణం వర్తించదు. ఎందుకు? దృష్టి సమకాలీన సృష్టిః, దృష్టి అనగా జ్ఞానం. వేరొక దానికి సంబంధించిన శబ్దజ్ఞానం లభిస్తున్న సమయంలో కుండ తయారుచేసే వాడు కుండ తయారుచేసాడు. శబ్దజ్ఞానం లభిస్తుండగా కుండ తయారయ్యింది. కానీ ఇది జ్ఞాన సమాన కాలీన సృష్టా? ఎందుకంటే జ్ఞానం అనేది ఒకదానిగురించి, సృష్టి అనేది మరొకదాని గురించి. అందువలన నీవు దృష్టి-సృష్టి అంటే ఏమిటి అనే దానికి సరైన విధంగా పూర్తి లక్షణను ఇవ్వలేదు అంటే ఆ లక్షణ దేనికి వర్తించకూడదో దానికి వర్తిస్తుంది.

**(సశేషం)**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

### శ్రీ శాంతి సాధన సప్తాహము

**ది.10-07-2025 నుండి-16-07-2025 వరకు:** పూజ్య శ్రీ ఓంకార స్వామిజి వారి దివ్య ఆశిస్సులతో, శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యములో గురుపూర్ణిమ సందర్భముగా సాధన సప్తాహము నిర్వహించబడును.

**కార్యక్రమ వివరాలు:**

**10-07-2025 :** గురువారం (వ్యాసపూర్ణిమ) సందర్భముగా

**ఉ॥ 7:00 గం॥లకు** - శ్రీ వ్యాసభగవానుల అష్టోత్తర శతనామార్చన, పూజ్య శ్రీ ఓంకార స్వామీజీ అష్టోత్తర శతనామార్చన స్వామిని శారదానంద మాతాజీ గారిచే నిర్వహింపబడును.

**సాయంత్రం 5:30-7:00గం॥లకు** - సత్సంగం, ధ్యానం - స్వామిని వినమ్రానంద మాతాజీ వారిచే జరిపించబడును.

**11-07-2025 శుక్రవారం నుండి 16-07-2025 బుధవారం వరకు:**

**ఉ॥ 5:00 - 6:00ల వరకు** - ధ్యానము -బ్ర. పూర్ణ చైతన్య

**ఉ॥ 6:30 - 7:30ల వరకు** - ఈశావాస్యోపనిషద్ - స్వామిని శారదానంద మాతాజీ

**9:30 - 10:30ల వరకు** - పంచదశి - బ్ర. పూర్ణ చైతన్య

**ఉ॥11:00-12:00ల వరకు** - ఆధ్యాత్మిక మెరుపులు, ధ్యానము - స్వామిని వినమ్రానంద మాతాజీ

మరియు

**సా॥ 5:30 - 7:00ల వరకు** - సత్సంగం, ధ్యానం - స్వామిని వినమ్రానంద మాతాజీ గారిచే జరిపించబడును.

సదస్సులో పాల్గొనే వారు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు :

7382009963 / 7382009962 / 6305349677

**స్థలం:**
**మాతృ ఆశ్రమము**
**శ్రీ శాంతి ఆశ్రమము,**
**తోటపల్లి, శంఖవరం, తూ.గో.జిల్లా, - 533446,**



## విరాళములు

1. శ్రీమతి డి.వి. కనక దుర్గ గారు (విశాఖపట్నం)
   వీరి భర్త శ్రీ డి.వి.ఆర్. అంజనేయులు గారి జ్ఞాపకార్థం. 10,000/-
2. శ్రీమతి రాజేశ్వరి ఆచార్యగారు (శాంతి ఆశ్రమం)
   వీరి భర్త శ్రీ గణేష్ చరణ్ ఆచార్యగారి జ్ఞాపకార్థం 5,000/-
3. శ్రీమతి సి.హెచ్.సుచరిత గారు (విజయవాడ)
   వీరి గృహప్రవేశ సందర్భముగా అన్నదానం 21,000/-
4. స్వామి శాంతానంద గారు (శాంతి ఆశ్రమం) గోగ్రాసం నిమిత్తం 5,000/-
5. శ్రీ కె.శ్రీరాంభరత్ గారు (విశాఖపట్నం) చెవిటి, మూగ స్కూల్ నిమిత్తం 10,000/-
6. శ్రీ వుండవిల్లి సుధాకర్ & రాధికగార్లు (బెండపూడి) వీరి కుమార్తె
   శ్రీయాజయని గారి పుట్టినరోజు సందర్భముగా అన్నదానం 10,000/-
7. శ్రీ యనమల రామకృష్ణుడుగారు (తుని)
   (రాష్ట్ర మాజీమంత్రివర్యులు, ఎమ్.ఎల్.సి.)
   వీరి పుట్టినరోజు సందర్భముగా అన్నదానం 5,000/-

## శాశ్వత అన్నదానం

1. శ్రీ బోలినేని బాలరాజు గారు (శాంతి ఆశ్రమం)
   వీరి తండ్రి శ్రీ రామయ్యగారి జ్ఞాపకార్థం 10,116/-

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

## తేజస్సు-దివ్యతేజస్సులో లీనమయినది

ఆశ్రమాభిలాషులు, భక్తులు, సాధకులైన **శ్రీ వింజమూరి రాధాకృష్ణగారు** ఆశ్రమ పాఠశాలకు కరస్పాండెంట్‌గా, ఆశ్రమ కమిటీ మెంబరుగా 20 సంవత్సరములు విశేషసేవలు చేస్తూ గురుకుల విద్యాభ్యుదయమునకు, ఆశ్రమాభివృద్ధికి ఎన్నో విధములుగా సహాయ సహకారములు అందించారు. వీరు శాంతాశ్రమ శాఖలు, తోటపల్లి, కోటగిరిలలో అనేక సాధనా శిబిరములతో ఉపనిషత్తులపై, అష్టావక్రగీతలపై సాధకులకు శిక్షణా తరగతులను నిర్వహించెడివారు.

వారు ఈమధ్య వరకు కూడా ఆన్‌లైన్ ద్వారా నిరంతరము ఉపనిషత్ క్లాసులను, మానసికోల్లాసముపై వ్యాఖ్యను అందించారు. శాంతి పత్రికకు అనేక వ్యాసాలను పంపించి శాంతిపత్రికకు చేదోడు వాదోడుగా వుండేవారు. వారి తండ్రిగారైన వింజమూరి సూర్యనారాయణగారు, మాతృమూర్తులైన అనసూయమ్మగారు, ఆశ్రమానికి అనేక సేవలందించారు. వారి ఆదర్శతనయునిగా తల్లితండ్రుల బాటలో నడిచి ఆశ్రమానికి విశేష సేవలందించి ఆదర్శ వానప్రస్థులై గడుపుతూ, ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ ఉన్నత విద్యలందించి వారిని ఉన్నత ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దిన **"మహామనీషి".** వీరు కాకినాడ వారి స్వగృహమునందు **14-05-2025** తేదీన అనాయాస దైవ సాయుజ్యము పొందిరి. వారు భౌతికముగా లేకపోవడము ఆశ్రమానికి, సమాజమునకు తీరనిలోటు. వీరి ఆత్మశాంతికై ఆశ్రమవాసులు ప్రార్థనలు చేసిరి. వారి కుటుంబ సభ్యులకు పూజ్యశ్రీ ఓంకారస్వామి మానసిక స్థైర్యము ప్రసాదించెదరు గాక.

**ఓం**

## దైవసాయుజ్యము

ది. **01-04-2025న వి. గోవిందరాజులుగారు** వారి స్వగృహమునందు దైవసాయుజ్యమును పొందారు. వీరు ఆశ్రమ కార్యాలయములో 15 సంవత్సరములు నిరంతర సేవలందించినారు. వీరు లేకపోవడము ఆశ్రమమునకు తీరనిలోటు. వారి ఆత్మకి శాంతి కలగాలని ఆశ్రమవాసులు ప్రార్థనలు చేసారు. వారి కుటుంబ సభ్యులకు పూజ్య స్వామీజీ ఆత్మస్థైర్యము ప్రసాదించెడివారు.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం – 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________________

______________________________

______________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda